PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 182 | 16 శుక్రవారం అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి



విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలిసారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియాడారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని ప్రశంసించారు.మహిళా శక్తిని చాటేందుకే విజయవాడలో ఈ మేళాను ఏర్పాటు చేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 650 స్టాళ్లు మహిళల నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ఉత్పత్తులు జాతీయ ఉత్పత్తులుగా మారాలని ఆకాంక్షించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా ఒక చరిత్ర సృష్టిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం డ్వాక్రా సంఘాలు రూ.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుంటూ, లక్ష కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయని, త్వరలోనే ఇది రూ.10 లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. త్వరలోనే పది లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆరు కోట్ల మందిని వ్యాపారవేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆయన స్ఫూర్తి ప్రశంసనీయమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తమ ఆశయమని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చర్యలు చేపట్టారని కొనియాడారు.

మిగతా 2 లో

## సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా



-రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

-ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ

-ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్

-ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు.

మిగతా 2 లో

## స్టాక్ మార్కెట్‌లో భారీ ర్యాలీ.. 1,500 పాయింట్లకు పైగా పెరిగిన సెన్సెక్స్!



-1,533.72 పాయింట్లు పెరిగి 74,315.61 వద్ద ముగిసిన సెన్సెక్స్

-374.65 పాయింట్లు లాభపడి 22,997.35కు చేరిన నిఫ్టీ

-4.03 శాతం ఎగబాకిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు

-టెక్ మహీంద్రా 4.61 శాతం లాభంతో టాప్ గెయినర్

మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో మాత్రం నష్టాలు

2 లో

## ధరల పెంపు కంట కొత్త సేవలపైనే దృష్టి ఐపీఓ ముందు ఆకాశ్ అంబానీ కీలక ప్రకటన



-టారిఫ్ పెంపు కంటే సేవల విస్తరణ ద్వారా ఆదాయం పెంచుకుంటామన్న ఆకాశ్ అంబానీ

-ధరలు పెంచే అవకాశం ఉన్నా, అదే ప్రధాన మార్గం కాదని స్పష్టీకరణ

-భారీ ఐపీఓకి సిద్ధమవుతున్న నేపథ్యంలో జియో భవిష్యత్ వ్యూహం వెల్లడి

-ప్రస్తుతం పరిశ్రమ సగటు కంటే తక్కువ ధరకే జియో డేటా అందిస్తోందన్న ఆకాశ్

దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతున్న జియో ప్లాట్‌ఫామ్స్ తన భవిష్యత్ వ్యూహాలపై కీలక ప్రకటన చేసింది. కేవలం మొబైల్ టారిఫ్ ధరలు పెంపు ద్వారానే కాకుండా, వినియోగదారులకు వినూత్న సేవలను చేరువ చేయడం ద్వారా ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ స్పష్టం చేశారు. అయితే, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరల పెంపు అనేది ఎప్పుడూ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుందని ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు.గురువారం ముంబైలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆకాశ్ అంబానీ కంపెనీ వృద్ధి ప్రణాళికలను వివరించారు. "టెలికాం రంగంలో టారిఫ్ ధరల పెంపు అనేది ఎప్పుడూ అందుబాటులో ఉండే ఒక అవకాశం. పరిస్థితులను బట్టి దానిపై నిర్ణయాలు ఉంటాయి. అయితే, రిలయన్స్ జియో వ్యూహం కేవలం డేటా ధరలపైనే ఆధారపడి ఉండదు. వినియోగదారులకు అదనపు విలువ కలిగిన సేవలను అందించి, తద్వారా రాబడిని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన వెల్లడించారు.టారిఫ్ పెంపు ఎప్పుడు ఉండవచ్చు అన్న ప్రశ్నకు ఆయన స్పష్టమైన గడువు ఏదీ ప్రకటించనప్పటికీ, ధరల సర్దుబాటుకు తగిన ఆస్కారం ఉందని అంగీకరించారు. "ప్రస్తుతం దేశ తలసరి ఆదాయంలో టెలికాం సేవలకు వినియోగదారులు వెచ్చిస్తున్న ఖర్చు 1 శాతం కంటే తక్కువగానే ఉంది. 2016లో జియో అరంగేట్రం చేసిన నాటితో పోలిస్తే ఈ వ్యయం దాదాపు సగానికి తగ్గింది" అని ఆయన గుర్తుచేశారు. ఇది భవిష్యత్తులో ధరల పెంపునకు సంకేతంగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మిగతా 2 లో



## అలాంటి వాళ్లను కాల్చి చంపాలి

### ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- సైనిక రహస్యాలు లీక్ చేసేవారిని కాల్చి చంపాలన్న ట్రంప్
- ఇరాన్‌పై దాడి వివరాలు మీడియాకు లీకయ్యాయని ఆరోపణ
- లీకేజీతో సైనిక చర్య సమయం మార్చినట్లు వెల్లడి
- రెండు రోజుల తర్వాత దాడి నిర్వహించినట్లు ట్రంప్ ప్రకటన
- లీకేజీకి పాల్పడిన వ్యక్తి వివరాలు వెల్లడించని అధ్యక్షుడు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సైనిక రహస్యాలను బయటపెట్టే వారిని కాల్చి చంపాలని అన్నారు. ఇరాన్‌పై దాడికి సంబంధించిన కీలక సమాచారం మీడియాకు లీక్ కావడంతో సైనిక చర్య సమయాన్ని మార్చాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇలాంటి వారికి జీవితాంతం జైలు శిక్ష విధించాలని కూడా వ్యాఖ్యానించారు.

మిగతా 2 లో

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా



ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం ఆరోపించారు.ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.

మిగతా 2 లో

## ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు



-ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

-కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం

-సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ

-ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది.

మిగతా 2 లో

# సాఫ్ట్బాల్ క్రీడ గెలవాలి

-భవిష్యత్తు క్రీడాకారుల కు సాఫ్ట్బాల్ మంచి ప్లాట్ ఫామ్-ఘనంగా ముగిసిన13వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్బాల్ టోర్నమెంట్

-బాలుర విభాగంలో విజయనగరం, బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప జిల్లా విజేతలు





ప్రజాసీమ

# సీఈసీని రక్షించేందుకే ఇదంతా: అభిజిత్ దీప్కే

మొదటిపేజీ తరువాయి

"ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు. 'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు. సీజేపీ నేతల అరెస్ట్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

# అలాంటి వాళ్లను కాల్చి చంపాలి

## ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

అరిజోనా రాష్ట్రంలోని బుల్‌హెడ్ సిటీలో ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ముందు అమెరికా బాంబర్లు బయలుదేరే, చేరుకునే సమయాలు మీడియాకు చేరాయని ఆరోపించారు. ఈ వివరాలు న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్‌లో వచ్చినట్లు పేర్కొన్నారు. దాడి సమయం మార్చాల్సి వచ్చింది! మిస్సోరీ నుంచి బీ–2 స్టెల్త్ బాంబర్లు బయలుదేరే సమయం బయటకు పొక్కడంతో ఆపరేషన్ ప్రమాదంలో పడిందని ట్రంప్ చెప్పారు. ఈ విషయంపై సీనియర్ సైనికాధికారులతో చర్చించినట్లు తెలిపారు. జనరల్ రజిన్ కేన్‌తో మాట్లాడిన తర్వాత దాడిని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అప్పటికే దాడికి సిద్ధమైన పైలట్లు ఈ నిర్ణయంతో నిరాశకు గురయ్యారని చెప్పారు. రెండు రోజుల తర్వాత దాడితొలుత అనుకున్న దాడిని రెండు రోజుల తర్వాత నిర్వహించినట్లు ట్రంప్ తెలిపారు. మొదట లీకైన సమయానికే బాంబర్లను పంపామని, దీంతో ఇరాన్ సైన్యాన్ని ఆశ్చర్యానికి గురిచేయగలిగామని పేర్కొన్నారు. అమెరికా సైనిక చర్యను ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా అభివర్ణించారు. అయితే, లీకేజీకి పాల్పడిన వ్యక్తి ఎవరనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఆరోపణలకు మద్దతుగా ఆధారాలు చూపలేదు. ఈ వ్యవహారంలో విచారణ ద్వారా ఎవరినైనా గుర్తించారా? అన్నదానిపైనా స్పష్టత ఇవ్వలేదు. గూఢచర్య చట్టం కింద చర్యలుఅమెరికాలో జాతీయ రక్షణకు సంబంధించిన సమాచారాన్ని అనధికారికంగా బయటపెట్టడంపై కఠిన చట్టాలున్నాయి. అందులో 'ఎస్పియోనేజ్ యాక్ట్' కీలకమైనది. ఈ చట్టం కింద రహస్య సమాచారాన్ని అక్రమంగా భద్రపరచడం, ఇతరులకు చేరవేయడం వంటి చర్యలపై కేసులు నమోదు చేయవచ్చు. ఈ నేపథ్యంలో సైనిక రహస్యాల లీకేజీపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్–2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

# స్టాక్ మార్కెట్‌లో భారీ ర్యాలీ.. 1,500 పాయింట్లకు పైగా పెరిగిన సెన్సెక్స్!

మొదటిపేజీ తరువాయి

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,500 పాయింట్లకు పైగా ఎగబాకగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 23 వేల మార్కుకు చేరువైంది. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు ఊతమిచ్చాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 4 శాతానికి పైగా పెరిగింది. ముడిచమురు ధరలు తగ్గడం, రూపాయి నిలకడగా ఉండటం, విదేశీ పెట్టుబడులు తిరిగి వచ్చే అవకాశాలపై ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్ 1,533.72 పాయింట్లు పెరిగి 74,315.61 వద్ద ముగిసింది. నిఫ్టీ 374.65 పాయింట్లు లాభపడి 22,997.35 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లు బలహీనపడినప్పటికీ, దేశీయంగా భారీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోని కంపెనీల అధిక విలువలపై ఆందోళనలు, అమెరికాలో అంచనాలను మించిన ద్రవ్యోల్బణం ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత మార్కెట్లపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా అత్యధికంగా 4.61 శాతం లాభపడింది. ఐసీఐసీఐ బ్యాంక్ 4.17 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.03 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.94 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 2.58 శాతం పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లూ లాభాల్లో ముగిశాయి. మరోవైపు భారత్ ఎలక్ట్రానిక్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి. అయితే, అన్ని విభాగాల్లోనూ కొనుగోళ్లు కనిపించలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.36 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.31 శాతం పడిపోయాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, మీడియా, ఎఫ్ఎంసీజీ షేర్లలోనూ ఒత్తిడి కనిపించింది.

# ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

# సాఫ్ట్బాల్ క్రీడ గెలవాలి

## భవిష్యత్తు క్రీడాకారుల కు సాఫ్ట్బాల్ మంచి ప్లాట్ ఫామ్

## ఘనంగా ముగిసిన13వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్బాల్ టోర్నమెంట్

## బాలుర విభాగంలో విజయనగరం, బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప జిల్లా విజేతలు





**పుల్లంపేట ప్రజాసీమా న్యూస్:**

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఎస్.డి.వి.డి. సభ స్కూల్ గ్రౌండ్స్ నందు గత మూడు రోజులుగా ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన 13వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్బాల్ టోర్నమెంట్ రంగరంగ వైభవంగా ముగిసింది. 15 జిల్లాల బాల బాలికల జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్లో ఉత్కంఠభరిత పోటీలు సాగాయి.

### బాలుర విభాగం

ప్రీ ఫైనల్స్లో భాగంగా ఉదయం కడప, విజయనగరం జట్లు పోటీపడగా, ప్రీ ఫైనల్ విజయం సాధించిన జట్టు ఫైనల్కు దూసుకెళ్లింది. మూడో స్థానంలో ఉన్న కర్నూలు జట్టుతో ఓడిన కడప జట్టు పోటీపడి, కర్నూలుపై విజయం సాధించి ఫైనల్కు చేరుకుంది. ఫైనల్ పోటీలో బాలుర జట్టు విజయనగరం, కడప జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. విజయనగరం జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 5–0తో కడపపై విజయం సాధించి కప్పు సొంతం చేసుకుంది.

బాలుర విభాగం స్థానాలు:

- ✓ మొదటి స్థానం: విజయనగరం జిల్లా
- ✓ రెండవ స్థానం: కడప జిల్లా
- ✓ మూడవ స్థానం: కర్నూలు జిల్లా
- ✓ నాలుగో స్థానం: శ్రీకాకుళం జిల్లా

### బాలికల విభాగం

ఉదయం జరిగిన బాలికల ప్రీ ఫైనల్లో గుంటూరు, కడప జట్లు పోటీపడగా, గుంటూరుపై 4–3తో విజయం సాధించి కడప జట్టు ఫైనల్కు దూసుకెళ్లింది. విజయనగరంతో గుంటూరు జట్టు పోటీపడి ఓడిపోగా, విజయనగరం జట్టు ఫైనల్కు చేరుకుంది. ఫైనల్లో కడప, విజయనగరం జట్లు పోటీపడగా, కడప జట్టు 8–4తో విజయనగరంపై విజయ దంకా మోగించి కప్పు సొంతం చేసుకుంది.

### బాలికల విభాగం స్థానాలు

- ✓ మొదటి స్థానం: వైఎస్ఆర్ కడప జిల్లా
- ✓ రెండవ స్థానం: విజయనగరం జిల్లా
- ✓ మూడవ స్థానం: గుంటూరు జిల్లా
- ✓ నాలుగో స్థానం: చిత్తూరు జిల్లా

### ప్రముఖుల ప్రసంగాలు

సాఫ్ట్బాల్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్ ఎన్వి రమణ మాట్లాడుతూ, "జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రతి క్రీడాకారుడికి ఇటువంటి అన్యాయం జరగదు. రాష్ట్రస్థాయిలో మిమ్మల్ని గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడించడమే మా ఉద్దేశం." అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ టెక్నికల్ ఇంచార్జ్ ఏ ఎస్ ఎస్ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "అంతర్జాతీయ స్థాయిలో ఆడిన ఆటగాళ్లందరినీ మీకు పరిచయం చేస్తూ, వీరిలాగే మీరు కూడా ఈ స్థాయికి ఎదగాలని" క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. "క్రీడాకారుల అవసరాలు గుర్తించి సాఫ్ట్బాల్ కిట్ను అందించడం మాకు పెద్ద వరంగా భావిస్తున్నాము. ప్రతి క్రీడాకారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కిట్ లేక ఇబ్బంది పడుతున్న పిల్లలను గుర్తించి ఇవ్వడం మాకెంతో ఆనందంగా ఉంది." అని తెలియజేశారు.

కడపజిల్లా సెక్రటరీ రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, "గత నెల రోజులుగా తోటి మిత్రులు అబ్దుల్లా, శివాజీ నాయక్, పుల్లంపేట యూత్ సహాయ సహకారాలతో ఇంతటి గొప్ప కార్యాన్ని చేయగలిగాము. జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ సహాయ సహకారాలతో గ్రౌండ్ సిద్ధం చేసి, రాత్రింబవళ్లు కష్టపడిన నాతోటి పుల్లంపేట యూత్ యువత అందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు." అని తెలిపారు.

"15 జిల్లాల బాల బాలికల క్రీడాకారులు ఎటువంటి అసౌకర్యానికి ఎదురుకాకుండా ఫుడ్ అందించిన మా మిత్రుడు, మా శ్రేయోభిలాషి ఫిజికల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గారికి, అందరి సహకారాలు అందించిన వారికి కృతజ్ఞతలు. కాబట్టి విజయం సాధించాము. ముఖ్యంగా ఎస్.డి.వి.డి. సభ స్కూల్స్ కరెస్పాండెంట్ నూకల శ్రీరాములు, ప్రిన్సిపల్ బాలాజీ, పుల్లంపేట బాయ్స్ హాస్టల్ వార్డెన్ తిరుపతి రెడ్డి, కస్తూరిబా హై స్కూల్ ప్రిన్సిపల్ రూప్ మేరీ మహిళలకు కాంబినేషన్ ప్రొవైడ్ చేసినందుకు, శివ పార్వతి హై స్కూల్ బాలాజీ బాబు , ప్రత్యూష హై స్కూల్ నరేంద్ర వారి సహకారంతో బస్సులు పంపి మాకెంతో సహాయ సహకారాలు అందించి ఈ విజయంలో పాలు పంచుకున్నారు." అని ఆయన తెలిపారు. సాఫ్ట్బాల్ స్టేట్ అబ్జర్వర్ మాట్లాడుతూ, "జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి తీసుకురావడమే నా ఉద్దేశం. అబ్దుల్లా లాంటి వ్యక్తి మీకు పూర్తిగా ఉండడం మీ అందరికీ గర్వకారణం." అని తెలియజేశారు. కడప జిల్లా అబ్దుల్లా మాట్లాడుతూ, "కడప జిల్లా సెక్రటరీ రామ సుబ్బారెడ్డి మన జిల్లాలో రాష్ట్రస్థాయి ప్రోగ్రాం నిర్వహిద్దామని, మీ అందరి సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. ఆయన కష్టం వృథా అవ్వకూడదని కలిసికట్టుగా పనిచేసి, 15 జిల్లాల క్రీడాకారులకు ఎటువంటి లోటుపాటు లేకుండా చూసుకుందామని ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులకు, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ కి, రాష్ట్ర సెక్రటరీలకు, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. నాలుగు నెలల సమయంలోనే జిల్లాలో జట్లలో ప్రతిభను గుర్తించి, మొదటి స్థానం సాధించిన బాలికల జట్టు చాలా కష్టపడింది. వారి కష్టానికి దక్కిన విజయమిది. కడప జిల్లా మొదటి స్థానంలో రావడం మాకెంతో ఆనందం కలిగించింది. మేము పడ్డ కష్టానికి ఫలితం దక్కింది." అని ఆనందం వ్యక్తం చేశారు. సాఫ్ట్బాల్ కోచ్ శివాజీ నాయక్ మాట్లాడుతూ, "పుల్లంపేటలో చదువుతూ, పుల్లంపేటలోనే నాకు సాఫ్ట్బాల్ క్రీడలో నేర్పిన మా గురువు వెంకటరమణ నేర్పిన ఆటతోనే నాకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది, ఈ స్థాయికి వచ్చాను." అని తెలిపారు.

### కృతజ్ఞతలు

రాష్ట్ర సాఫ్ట్బాల్ సెక్రటరీ, కడప జిల్లా సెక్రటరీ రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ ఇంత స్థాయిలో ఘనవిజయం సాధించినందుకు సహకరించిన ఈ ఆటను పుల్లంపేట గ్రామ ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించి, వారికి వెన్నంటి ఉండి సహాయ సహకారాలు అందించిన పుల్లంపేట ప్రజలకు కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

### సన్మానం, బహుమతుల ప్రదానం

వివిధ జిల్లాల నుంచి వచ్చిన జిల్లా సెక్రటరీలకు, అధ్యక్షులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విజయం సాధించిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని క్రీడలను వీక్షించి, క్రీడాకారులను ఉత్తేజపరిచారు.





# ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

మహిళలను ఇకపై కేవలం లఖ్‌పతి దీదీలుగానే కాకుండా కరోడ్‌పతి దీదీలు గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వాలు అడుగులు వేయాలి. స్వయం సహాయక సంఘాల ద్వారా దేశవ్యాప్తంగా మహిళల్లో అద్భుతమైన ఆర్థిక, సామాజిక చైతన్యం వచ్చింది. వారి ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్, ప్యాకింగ్, , డిజిటల్ మార్కెటింగ్ నెట్‌వర్కింగ్ కల్పించడం ద్వారా మధ్యవర్తుల వ్యవస్థను పూర్తిగా తొలగించాలి. వికసిత్ భారత్ సాధనలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకం అని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ... ఢిల్లీ వెలుపల తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సరస్ మేళాకు విజయవాడ వేదిక కావడం ఏపీకే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తాము ప్రారంభించిన డ్వాక్రా పొదుపు ఉద్యమం నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు ఏకంగా రూ.69,000 కోట్ల టర్నోవర్ సాధించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాయి. ఇప్పటికే ఏడాది కాలంలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాం. రాబోయే రోజుల్లో 10 లక్షల మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా మార్చడమే మా లక్ష్యం. పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదిగాయి, త్వరలోనే ఇవి అంతర్జాతీయ బ్రాండ్లుగా అవతరిస్తాయి అని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఏపీలోని మహిళా సంఘాల ఉత్పత్తుల గ్లోబల్ మార్కెటింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్వయం ఏపీ బ్రాండ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇకపై ప్రముఖ ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల్లో స్వయం ఏపీ పేరుతోనే మహిళల ఉత్పత్తులు విక్రయానికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు మహిళల ఆర్థిక భరోసా కోసం తల్లికి వందనం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాలను అమలు చేస్తున్నామని, సేవింగ్ మనీ స్థాయి నుంచి మేకింగ్ మనీ స్థాయికి మన మహిళలు ఎదిగారని సీఎం కొనియాడారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో ప్రతి ఎస్ హెచ్ జీ ఒక ఆర్థిక శక్తిగా మారనుందని ఉద్ఘాటించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రధాని మోదీ కన్న 6 కోట్ల లఖ్‌పతి దీదీల కల సాకారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు సాంకేతికతను జోడించి డ్వాక్రా మహిళలను సరికొత్త పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాల కోసం పెద్ద ఎత్తున షీ మార్టులు ఏర్పాటు చేస్తామని, మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న వినూత్న మోడల్‌ను దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరిస్తామని మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ఈ జాతీయ సరస్ మేళా?2026 ద్వారా దేశంలోని విభిన్న రాష్ట్రాలకు చెందిన రూరల్ ఎంట్రప్రెన్యూర్లు, చేతివృత్తుల కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించే గొప్ప అవకాశం లభించింది. విజయవాడ వేదికగా ప్రారంభమైన ఈ మేళా గ్రామీణ మహిళా రైతులు, వ్యాపారవేత్తల ఆదాయ మార్గాలను పెంచడమే కాకుండా, వికసిత్ భారత్ స్వప్నానికి సరికొత్త ఊపిరి పోస్తుందని హాజరైన ప్రముఖులంతా ఆకాంక్షించారు.

# ఏపీజే అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడు

## - చిత్రపటానికి ఘన నివాళులు

**వేంపల్లె ప్రజాసీమ:**

మాజీ రాష్ట్రపతి, భారతరత్న, క్షిపణి పితామహుడు ఏపీజే అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. గురువారం అబ్దుల్ కలాం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ స్వయంకృషి, స్వియ ప్రతిభతో రామేశ్వరం నుండి రాష్ట్రపతి భవన్ వరకు అబ్దుల్ కలాం ఎదిగారన్నారు. కలలు కనండి.. సాకారం చేసుకోండి అని అబ్దుల్ కలాం సందేశం యువతకు తారక మంత్రంలా పని చేసిందన్నారు. రక్షణ, అంతరిక్ష, వైద్య, మానవ రంగాల కోసం కృషి చేశారన్నారు. అగ్ని, పృథ్వీ క్షిపణుల రూపశిల్పి.. ఆయన నిరంతర విధ్యార్థి, కలాం జయంతి అక్టోబర్ 15న ప్రపంచ విధ్యార్థి దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, నాయకులు సుబ్రమణ్యం, దృవకుమార్ రెడ్డి, రామకృష్ణ, ఉత్తన్న, అమర్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డిగ్రీ అడ్మిషన్లు ఫేజ్ -3 విడుదల

## - ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## - ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ

**వేంపల్లె ప్రజాసీమ:**

ఏపి ఉన్నత విద్యా కమిషనరేట్ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ అడ్మిషన్లు ఫేజ్ -3 షెడ్యూల్ విడుదల చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ వెల్లడించారు. ఈనెల 24 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్, 25 నుండి 27 వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్, 26 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్, 28న వెబ్ ఆప్షన్ మార్పు, 30న సీట్లు కేటాయింపు, అలాగే 30 నుంచి నవంబర్ 2 వరకు కళాశాలలో రిపోర్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని, అర్హులైన విధ్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.




# స్కందమాత దేవి అలంకారంలో దుర్గమ్మ తల్లి

## - ఆలయ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ రెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**

దసరా ఉత్సవాల నేపథ్యంలో స్థానిక సాయినగర్ లోని దుర్గమ్మ ఆలయంలో స్కందమాత దేవిగా దుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అర్చకుడు శాకల్య విష్ణుశర్మ ఆధ్వర్యంలో దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదవ రోజు స్కందమాత దేవిగా దుర్గమ్మ భక్తులను కటాక్షించారని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దుర్గమ్మను దర్శించుకుని ఆశీస్సులు పొందారన్నారు. ఈనెల 20న దుర్గమ్మ తల్లి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ ప్రాంగణం అంతా విద్యుత్ దీపాలు, ప్రత్యేక పూల అలంకరణ నడుమ ఉత్సవాలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.



# చైర్మన్ స్థానంతో సహా అన్ని వార్డుల్లో పోటీకి కాంగ్రెస్ సిద్ధం

## - మదనపల్లి మున్సిపాలిటీలో జెండా ఎగరవేయడమే లక్ష్యం- కాంగ్రెస్ నేతలు కొండుపల్లి ఆనంద్,ఎస్.కె బాషా వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో చైర్మన్ అభ్యర్థితో సహా 48 వార్డు లలోను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని డిసిసి ఉపాధ్యక్షులు కొండుపల్లి ఆనంద్,మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కే బాషాలు ప్రకటించారు.గురువారం శీనా టీ స్టాల్ ఏదురుగా ఉన్న మదనపల్లె ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఇప్పటికే బలమైన అభ్యర్థులను పోటీకి నిలిపే విధంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమను సంప్రదిస్తే నియోజకవర్గ ఇన్చార్జ్ మల్లెల పవన్ కుమార్ రెడ్డి ద్వారా డిసిసి మరియు ఏపిసిసిల దృష్టికి తీసుకెళ్లి వారికి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీకి నిలిపేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.మదనపల్లె నియోజకవర్గంతోపాటు మదనపల్లె మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారా మాత్రమే జరిగిన విషయాన్ని వారు గుర్తు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీకి నూతన జవసత్వాలు నింపేవిధంగా అధిష్టానం గట్టి ప్రయత్నం చేస్తోందని కావున కాంగ్రెస్ పార్టీలో పనిచేయాలని ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత మున్సిపల్ ఎన్నికలలో బీసీలు,మహిళలు పోటీ చేయడానికి మెండుగా అవకాశాలు ఉన్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కాంగ్రెస్ పార్టీలో మాత్రమే కుల,మత రాజకీయాలకు అతీతంగా నాయకులు రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని,తద్వారా కాంగ్రెస్ పార్టీలో ఎదుగుదలకు అందరికీ అవకాశం ఉంటుందని గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది రాజకీయ నాయకులు ఉన్నత పదవులను అలంకరించారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.ఈ కార్య క్రమంలో పార్టీ నాయకులు సలీం,భాను,షబానా,నజీమ్ షేక్,తాజూన్,షమీం షేక్,అక్బర్,మంజునాథ్,సాదిక్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# చైతన్య సర్వీస్ సొసైటీలో కలాం జయంతి వేడుకలు

## - జనరల్ సెక్రటరీ ఎ.కవితా రాణి ఆధ్వర్యంలో ఘననివాళి







**మదనపల్లె (ప్రజా సీమ) :**

భారత మాజీ రాష్ట్రపతి,భారతరత్న పురస్కార గ్రహీత, ప్రముఖ శాస్త్రవేత్త,మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతిని పురస్కరించుకొని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ.కవితా రాణి,కోశాధికారి పట్నం గిరిజమ్మాళ్,సంస్థ బృంద సభ్యులు వై.జనార్ధన్, టి.భార్గవి,ఎస్.భారతి, విద్యార్థులు కలిసి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ.కవితా రాణి మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సాధారణ కుటుంబంలో జన్మించి,చిన్నతనంలోనే కుటుంబానికి సహాయం చేయడానికి వార్తాపత్రికలు పంపిణీ చేసిన కలాం,ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ విద్యపై అపారమైన ఆసక్తితో ముందుకు సాగారని తెలిపారు.క్రమశిక్షణ,కష్టపడే తత్వం,పట్టుదల,సమయపాలన,నిరంతర అభ్యాసం ఆయనను గొప్ప శాస్త్రవేత్తగా,భారత రాష్ట్రపతిగా,కోట్లాది మంది యువతకు మార్గదర్శిగా నిలిపాయని వివరించారు. కలాం చిన్నతనం నుంచి ఎదుర్కొన్న కష్టాలను,విద్య పట్ల ఆయనకున్న అంకితభావాన్ని,దేశ రక్షణ రంగంలో శాస్త్రవేత్తగా అందించిన సేవలను పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించారు.భారతదేశ క్షిపణి,అంతరిక్ష పరిశోధన రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు.భారతదేశం స్వావలంబన సాధించాలనే ఆయన ఆకాంక్ష,యువతలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించాలనే ఆయన తపన ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.డాక్టర్ కలాం ప్రసిద్ధ సందేశమైన కలలు కనండి,ఆ కలలను సాకారం చేసుకోవడానికి నిరంతరం కృషి చేయండనే స్ఫూర్తిని విద్యార్థులకు వివరిస్తూ,నిద్రలో కనిపించేవి మాత్రమే కలలు కావని,మన జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి,ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి మనల్ని నిరంతరం ప్రేరేపించేవే నిజమైన కలలని కవితా రాణి వివరించారు.మన జననం ఎలాంటి పరిస్థితుల్లో జరిగినా మన జీవితం సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు.ఇందులో భాగంగా విద్యార్థులందరితో కవితా రాణి ప్రతిజ్ఞ చేయించారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని,తల్లిదండ్రులు పెద్దలను గౌరవించాలని,గురువుల మార్గదర్శకత్వాన్ని అనుసరించాలని,తనపై తాను నమ్మకం ఉంచుకోవాలని, క్రమశిక్షణతో జీవించాలని,దేశానికి మరియు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు.డాక్టర్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జ్ఞానం, వినయం,దేశభక్తి,మానవతా విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి పట్నం గిరిజమ్మాళ్,సిబ్బంది వై.జనార్ధన్, టి.భార్గవి, ఎస్.భారతి,విద్యార్థులు పాటలు,ఉపన్యాసాల ద్వారా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గొప్పతనాన్ని,ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. విద్యార్థులు ఆయన జీవితంలోని ఆదర్శాలను వివరిస్తూ తమ ప్రసంగాలతో అందరినీ ఆకట్టుకున్నారు.డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని కవితా రాణి పేర్కొన్నారు.

# కలకడ మండలంలో సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు

## 16 గ్రామపంచాయతీలకు రిజర్వేషన్ల ప్రకటన..

## ఆశావహుల్లో పెరిగిన ఉత్కంఠ..

**కలకడ ప్రజాసీమ:**




2026 రెండో విడత సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కలకడ మండలంలోని 16 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఖరారైనట్లు అధికారిక ప్రకటనద్వారా వెల్లడైంది. ఇందులో బీసీ మహిళలకు 2, బీసీకి 3, ఎస్సీ మహిళకు 1, ఎస్సీకి 1, ఎస్టీకి 1, ఓపెన్ మహిళలకు 4, ఓపెన్ కేటగిరీకి 4 స్థానాలు కేటాయించినట్లు అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

రిజర్వేషన్ ప్రకారం జాబితా ఈ విధంగా ఉన్నది.

1 బాలయ్యగారిపల్లె బీసీ మహిళ (దీజ-ఔ),2 దేవలపల్లె ఓ ెఎ న్ మహిళ (ఖ=-ఔ),3 దిగువ తాండా ఎస్టీ (ూ),4 ఎర్రకోటపల్లె ఓపెన్ (ఖ=),5 గంగాపురం ఓపెన్ మహిళ (ఖ=-ఔ),6 గుడిబండ బీసీ (దీజ), 7 కె.బట్టివారిపల్లె ఓపెన్ (ఖ=),8 కె.దొడ్డిపల్లె ఓ ెఎ న్ మహిళ (ఖ=-ఔ),9 కదిరాయచెరువు ఓపెన్ (ఖ=),10 కలకడ ఓ ెఎ న్ మహిళ (ఖ=-ఔ),11 కోన బీసీ మహిళ (దీజ-ఔ),12 ముదియంవారిపల్లె బీసీ (దీజ),13 నడిమిచెరువు బీసీ (దీజ),14 నవాబ్‌పేట ఎస్సీ మహిళ (ూజ-ఔ),15 రాతి గుంటపల్లెఎస్సీ (ూజ), 16 యను గొండపాలెం ఓపెన్ (ఖ=). రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవిని ఆశిస్తున్న అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది. తమకు అనుకూలమైన రిజర్వేషన్ వచ్చిన పంచాయతీల్లో ఇప్పటికే రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల ఎంపికపై చర్చలు ప్రారంభమయ్యేయిూ.

# జనసేన కౌన్సిలర్ అభ్యర్థినిగా పోటీకి మల్లికా సిద్ధం

## - అవకాశం ఇస్తే 5వ వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లా,మదనపల్లి పట్టణం, ఐదవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థినిగా జనసేన పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు జనసేన సీనియర్ మహిళా నాయకురాలు మల్లికా సిద్దు పేర్కొన్నారు.ఈ సంద ర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లా డుతూ ఐదవ వార్డు బీసీ మహిళకు (రిజర్వేషన్) కేటాయిం చారని బీసీ బిడ్డగా కౌన్సిలరుగా పోటీ చేసేం దుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాన న్నారు. జనసేన అధినేత,ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అను గుణంగా పనిచేస్తు న్నామని, కౌన్సిల రుగా ఎంపికైతే ప్రజాసేవకు పున రంకిత మవుతానన్నారు.తనకు జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ రాందాస్ చౌదరి, ఇతర నేతలు సహకరిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఇప్పటికే జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా, మడికయ్యల శివాలయం డైరెక్టరుగా సమర్థవంతంగా పనిచేస్తున్న మల్లికకు కౌన్సిలరుగా అవకాశం ఇస్తే మరింత సేవ చేస్తారని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



ప్రజాసీమ

# స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు

## - నిబంధనలు అతిక్రమిస్తే అనర్హత వేటు తప్పదు- అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి స్పష్టం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లాలో త్వరలో జరగనున్న పట్టణ,స్థానిక సంస్థల ఎన్నికలను,నూరు శాతం పారదర్శకంగా,ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నేపథ్యంలో అభ్యర్థులు,రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని,అలాగే ఎన్నికల ప్రక్రియ సాఫీగా సాగేందుకు జిల్లా పోలీసుశాఖ జారీచేసిన ముఖ్యమైన మార్గదర్శకాలను మరియు ఉల్లంఘిస్తే,తీసుకునే చర్యల వివరాలను గురువారం ఎస్పీ పత్రికా ప్రకటన ద్వారా విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ

వేర్వేరు పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒకే సమయంలో మరియు ఒకే మార్గంలో ర్యాలీగా వెళ్లరాదని,ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇచ్చి,సూచించిన సమయాల్లో మాత్రమే వెళ్లాలన్నారు.సభలు,ర్యాలీలు,రోడ్ షోలు నిర్వహించే వారు 48 గంటల ముందే పోలీసు అనుమతి తీసుకోవాలని,ప్రచార వాహనాలకు పాస్ తప్పనిసరన్నారు.ర్యాలీలు నిర్వహించడానికి పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరని,పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే,నిబంధనలు ఉల్లంఘించిన



వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు.ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైకులు వాడాలని,అలాగే ఆసుపత్రులు,విద్యాసంస్థలు,ప్రార్థనా మందిరాల వద్ద (సైలెంట్ జోన్స్) వాడరాదన్నారు.ఓటర్లను ఆకర్షించేందుకు మద్యం,నగదు,బహుమతులు పంపిణీ చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని,పట్టుబడితే ఎన్నికల అధికారులకు నివేదించి,అభ్యర్థిత్వం రద్దు (అనర్హత వేటు) చేయిస్తారన్నారు.అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కడితే,ఎన్నికల ఖర్చు ఖాతాలో చేర్చడమే కాకుండా పబ్లిక్ ప్రాపర్టీ డిఫేస్‌మెంట్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తారన్నారు.సరైన పత్రాలు,ఆధారాలు లేకుండా ఎవరూ కూడా రూ.50 వేలు కంటే ఎక్కువ నగదును రవాణా చేయరాదని,అలాగే తనిఖీల్లో సరైన పత్రాలు లేని రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్ చేస్తారన్నారు.లైసెన్స్ ఆయుధాలను వెంటనే పోలీసులకు డిపాజిట్ చేయాలన్నారు.స్థానిక ఎన్నికలు మన ఊరి భవిష్యత్తును నిర్ణయించేవి కనుక వీటిని పండుగ వాతావరణంలో బాధ్యతాయుతంగా జరుపుకుందామన్నారు.కావున ఓటర్లు ఎలాంటి భయాలు,ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీస్ స్టేషనుకు లేదా పోలీస్ ఎమర్జెన్సీ : డయల్ 100/11కు కాల్ చేయాలని ఎస్పీ సూచించారు.

# కురబలకోట జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

## - టిడిపి యువనేత గజ్జల ఈశ్వర్ నాయుడు వినతి

## - విద్యావంతులకు అవకాశం కల్పిస్తేనే అభివృద్ధి సాధ్యం

**కురబలకోట (ప్రజా సీమ) :**




స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా వంతులకు, యువతకు ప్రాధాన్యత కల్పించాలని కురబలకోట మండలానికి చెందిన గజ్జల ఈశ్వర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. రాబోయే జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేం దుకు తనకు అవకాశం కల్పించాలని తెలుగు దేశం పార్టీ నాయకత్వాన్ని కోరు తున్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గం, కురబల కోట మండలానికి చెందిన గజ్జల ఈశ్వర్ నాయుడు మాట్లాడుతూ తమ కుటుం బానికి తెలుగుదేశం పార్టీతో దశాబ్దాలుగా అనుబంధం ఉందని,పార్టీ పట్ల తమ కుటుంబానికి ఉన్న నిబద్ధతను గుర్తించి,ఈసారి జెడ్పీటీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు.ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కొత్త ఆలోచనలు,ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.విద్యావంతులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలను అర్థం చేసుకుని,వాటి పరిష్కారానికి కృషి చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల మార్పులు తీసుకురావచ్చని వెల్లడించారు.జెడ్పీటీసీ పదవి కేవలం ఒక హోదా మాత్రమే కాదని,ప్రజలకు సేవ చేసే బాధ్యతతో కూడుకున్నదని ఈశ్వర్ నాయుడు అభిప్రాయపడ్డారు.ప్రజల అవసరాలను గుర్తించి,అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు.తమ కుటుంబం గత కొన్ని దశాబ్దాలుగా టీడీపీతో కలిసి కొనసాగుతోందని తెలిపిన ఆయన,పార్టీ నాయకత్వం తమ కుటుంబ అనుబంధాన్ని,పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.విద్యావంతులకు ప్రాధాన్యతనిస్తూ యువతను రాజకీయాల్లో ప్రోత్సహించడం ద్వారా సమర్థవంతమైన నాయకత్వం ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు అవకాశం లభిస్తేజెడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలిచి ప్రజల మద్దతుతో విజయం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు.జెడ్పీటీసీగా అవకాశం లభించి ప్రజల మద్దతుతో విజయం సాధిస్తే,ప్రజా సమస్యల పరిష్కారానికి,గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానన్నారు.కురబలకోట జెడ్పీటీసీ అభ్యర్థిత్వంపై గజ్జల ఈశ్వర్ నాయుడు ఆసక్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో టీడీపీ నాయకత్వం ఆయన అభ్యర్థిత్వంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.

# కలర్ ఓటర్ల జాబితాలను సత్వరమే అన్నిపార్టీలకు అందజేయాలి

## - వైకాపా సమన్వయకర్త నిసార్ అహ్మద్ డిమాండ్ - మున్సిపల్ అధికారుల పక్షపాత ధోరణిపై కలెక్టర్‌కు వినతి





**మదనపల్లె (ప్రజా సీమ) :**

రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో మదనపల్లె మున్సిపాలిటీలోని 48 వార్డులకు సంబంధించిన ఓటర్ల ఫొటోలతో కూడిన కలర్ ఓటర్ల జాబితాలను అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు వెంటనే అందించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మదనపల్లె వైకాపా ఇంచార్జ్ ఎస్.నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు.ఈ వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ అధికార పార్టీకి ఫొటోలతో కూడిన కలర్ ఓటర్ల జాబితాలను అందించి,వైఎస్సార్‌సీపీ పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ మదనపల్లె మున్సిపల్ కమిషనర్ స్పందించకపోవడం పట్ల పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సమానంగా ఓటర్ల జాబితాలు అందించకపోవడం ఎన్నికల పారదర్శకత, సమాన అవకాశాలపై సందేహాలు కలిగిస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని మదనపల్లె మున్సిపల్ కమిషనర్‌కు తగిన ఆదేశాలు జారీ చేసి,48 వార్డులకు సంబంధించిన కలర్ ఫొటో ఓటర్ల జాబితాలను వైఎస్సార్‌సీపీతోపాటు మిగిలిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేయాలని కోరారు.వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి,రాష్ట్ర ప్రచార కార్యదర్శి సి.పి రాఘవ రెడ్డి,రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఎస్.కె ఇర్ఫాన్,మాజీ కౌన్సిలర్లు శ్రీనివాసులు,ఈశ్వర్ నాయక్ నాయకులు చిప్పిలి మల్లికార్జున రెడ్డి,బయ్యారెడ్డి,కొత్తపల్లి మహేశ్,వడిగల శ్రీకాంత్,హబీబ్, ఫిరోజ్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచాలి

## పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్

**సిద్దవటం ప్రజా సీమ**



పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణకు రైతులు పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచాలని భాకరాపేట పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్ సూచించారు. మండలంలోని భాకరాపేటలో గురువారం ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు నవంబర్ నుంచి వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని తెలిపారు. పశువులు కలుషిత నీటిని తాగకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశుపోషకులకు అవసరమైన సలహాలు, సూచనలు ఎల్లవేళలా అందిస్తామని డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూమిలో నాటిన బోర్డులు తీసేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

## తాసిల్దార్ శివకుమార్..

**పీలేరు ప్రజాసీమ:**

బోడుమల్లి వారి పల్లి పంచాయతీకి సంబంధించిన గ్రామంలోని 652 సర్వే నెంబర్లు 11 మరియు7 లెటర్లలో ప్రభుత్వం కమ్యూనిటీ ప్రభుత్వ సౌకర్యాల కోసం సుమారు 15 నుండి 20 సెంట్లు వరకు కేటాయించడంతో ఆ స్థలంలో కొంతమంది అక్రమ దారులు నాయకులు అధికారులనుబెదిరించి అక్రమంగా పాగావేశారు దీనిపై పలుపత్రికలలో వార్తలురావడంతో తాసిల్దార్ స్పందించి గత రెండు రోజుల క్రితం బోర్డు ఏర్పాటు చేశారు అయితే రాత్రికి రాత్రే కబ్జాదారులు బోర్డు పీకేయడంతో తిరిగి పోలీసు వారి సిబ్బందితో రెవెన్యూ సిబ్బంది బోర్డు ఏర్పాటు చేశారు మరోసారి బోర్డు పీకేస్తే అక్రమదారులపై క్రిమినల్ కేసులో నమోదు చేసి జైలుకు పంపించడం ఖాయమని తాసిల్దార్ అన్నారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ మురగై విఆర్ఓ సిద్దయ్య వీఆర్ఏలు మల్లికార్జున రెడ్డప్ప పోలీస్ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు




# అవకాశం ఇవ్వండి.. అభివృద్ధికి కృషి చేస్తా.!

## రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ బరిలో జంగం రాచు పల్లి నాగజ్యోతి

## బీసీ మహిళకు రిజర్వేషన్‌తో ముందడుగు..

**రాజంపేట (ప్రజా సీమ):**



రాజంపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఉన్నత విద్యను అభ్యసించిన నాయి బ్రాహ్మణ కులానికి చెందిన జంగం రాచు పల్లి నాగజ్యోతి పేరు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆమె వెల్లడించారు. ప్రజలు పట్ల విధేయతతో ఉంటూ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజాసేవ ద్వారా పట్టణ అభివృద్ధిలో భాగస్వామి కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ చేయాలనే ఆమె ఆసక్తి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ రాజంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తన మామ జంగం రాచు పల్లి రామకృష్ణ గతంలో మార్కెట్ గుత్తేదారుడుగా పనిచేసిన అనుభవం ఉండడంతో వ్యాపారులతో పాటు ప్రజల్లో సుపరిచితుడుగా మంచి గుర్తింపు ఉందని తెలియజేశారు. ప్రధానంగా పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలు తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పిస్తే ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు, ఓటర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు తనకు ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా మద్దతుగా నిలిచి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ పదవికి సంబంధించిన రిజర్వేషన్ నేపథ్యంలో జంగం రాచు పల్లి నాగజ్యోతి పేరు తెరపైకి రావడంతో రాజంపేట రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. ఏది ఏమైనాప్పటికీ మొట్టమొదటిసారిగా రాజంపేట మున్సిపాలిటీలో చైర్మన్ అభ్యర్థిగా జంగం రాచు పల్లి నాగజ్యోతి ముందుకు రావడంతో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి.

# శ్రీ మానసా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

## ఆలయ అర్చకుడు శర్మ

**సిద్ధవటం ప్రజా సీమ**

మండలంలోని కడప- చెన్నై జాతీయ రహదారి కనుమలో పల్లె సమీపాన వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో గురువారం దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శర్మ మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య ఆధ్వర్యంలో దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాలు వైబోవ హితంగా జరుగుతున్నాయని అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి, జలాభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవాచనం పంచామృత అభిషేకాలు వంటి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్చ ప్రసాదాలు అందించామన్నారు ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు



ప్రజాసీమ

# అధికారులు చూపిన భూహద్దులతో కొత్త సమస్యలు

– తన భూమికి లోపభూయిష్టంగా సరిహద్దులు వేశారు– న్యాయం చేయాలని జిల్లా కలెక్టరుకు రైతు లక్ష్మన్న అభ్యర్థన

**మదనపల్లె (ప్రజా సీమ) :**




అన్నమయ్య జిల్లా,తంబళ్లపల్లి మండలం,గుండ్లపల్లి పంచాయతీ,చెట్లవారిపల్లిలో వున్న తమ వ్యవసాయ భూమికి సంబంధించి సరిహద్దులను చూపించడంలో సర్వే అధికారులు,గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎక్కడ సమన్వయం లేకుండా వేరువేరుగా హద్దులు చూపించడంపై బాధిత రైతు కాలా లక్ష్మన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం స్థానిక మదనపల్లె ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు లక్ష్మన్న మాట్లాడుతూ తనకు సర్వేనెంబర్ 234/5డిలో వున్న భూమికి సరిహద్దులు చూపమని సర్వే చేయించడం జరిగిందని తెలిపారు.ఇందులో గ్రామ సచివాలయం సర్వేయర్ నుంచి,మండల సర్వేయర్,డివిజనల్ సర్వేయర్ మరియు జిల్లా సర్వేయర్లకు భూమి సరిహద్దుల కోసం సర్వే చేయాలని చలాన కట్టి అభ్యర్థించడం జరిగిందని వివరించారు.తమ భూమి సరిహద్దులను ప్రత్యర్థులు చెరిపివేసి ఆక్రమించుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారని దీనిపై హద్దులు చూపాలని అధికారులను కోరుతున్నట్లు తెలిపారు.ఈ విషయంలో జిల్లా కలెక్టర్ కు పీజీఆర్ఎస్ ద్వారా కూడా అభ్యర్థించడం జరిగిందని గుర్తుచేశారు.ఇప్పటికైనా సర్వేయర్లు కచ్చితంగా తమ భూమికి సరిహద్దులు ఒకే విధంగా చూపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం సీఎంపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ రైతు లక్ష్మన్న భూమికి సరిహద్దులు నిర్ణయించే విషయంలో ప్రత్యర్థుల ఒత్తిడికి సర్వేయర్లు తలొగ్గి తరచూ హద్దులు మార్చడంపైన అసహనాన్ని వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకొని బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు

## సిద్దవటం ఎస్సై హారిక హెచ్చరిక

**సిద్దవటం ప్రజా సీమ**



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎస్సై హారిక హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా ఇతరులను కించపరిచేలా, కులమతాల మధ్య విభేదాలు సృష్టించేలా, వ్యక్తుల మనో భావాలను దెబ్బతీసేలా పోస్టులు, వ్యాఖ్యలు చేయరాదన్నారు. తప్పుడు వార్తలు, నిరాధార ఆరోపణలు ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మి, నిర్ధారణ చేసుకోకుండా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా ఉపేక్షించేది లేదని ఎస్సై హారిక హెచ్చరించారు.

# మమ్మును సన్మానించిన రాజంపేట పార్లమెంట్ సెక్రటరీ పర్వీన్ తాజ్!

**పుంగనూరు ప్రజాసీమ :**

వై ఎస్ ఆర్ పార్టీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్న మమ్మును గురువారం రాజంపేట పార్లమెంట్ సెక్రటరీ పర్వీన్ తాజ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ మైనారిటీ ఉపాధ్యక్షుడు సద్దాం హుస్సేన్ యూనిట్ ఇంచార్జ్ షామీర్ లాల్ మౌలా జుబేర్ రెడ్డి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు



# ఐదవ రోజుకి చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు

– శాఖాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీమహమ్మారమ్మ





**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లి పట్టణం,ఎస్బిఐ కాలనీ నందు వెలసిన శ్రీమహమ్మారమ్మ తల్లి దేవస్థానం నందు శరన్నవరాత్రి వేడుకలు కన్నుల పండుగలా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా గురువారం శాఖాంబరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ శర్మ,అర్చకులు నారాయణ స్వామి ఆధ్వర్యం లో విశేష పూజలు అభిషేకాలు జరుగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల నడుమ వేడుకలు జరుగుతున్నాయి.అమ్మవారికి పంచామృతాభిషేకం,తీర్థప్రసాద వినియోగము,లలిత సహస్రనామ కుంకుమార్చన,ప్రాకారోత్సవం, అమ్మవారికి దశ విధ హారతులు, మహా మంగళ హారతి నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొమ్మాడి రామకృష్ణారెడ్డి,గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,నాదెళ్ళ వెంకటేశ్వర ప్రసాద్ (శివన్న),డి.ద్వారకనాథ రెడ్డి,వైస్ చైర్మన్ కొండుపల్లి ప్రసాద్ బాబు,సెక్రటరీ గంగాసాని మస్తాన్ రెడ్డి,ట్రెజరర్ పి.వి.శ్రీనివాస రామమూర్తి (భవాని శ్రీను),జాయింట్ సెక్రటరీ ఎస్.మాధవ రెడ్డి కో–ట్రెజరర్ బిఎం.వెంకటరమణ,ఆలయ ట్రస్టీలు బి.వెంకటేశ్వర రెడ్డి,శ్రీరామ సహదేవ నాయుడు,మారువేణి వెంకట్రాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని,కావున పుర ప్రజలు, అమ్మవారి భక్తులు నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి కృపా కటాక్షానికి పాత్రులు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ కాలనీ ప్రజలు,ప్రముఖులు,అమ్మ వారి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# డివైడర్ ను ఢీకొన్న షిఫ్ట్ కార్!

## ఒకరు మృతి ముగ్గురికి గాయాలు!



**పుంగనూరు ప్రజాసీమ :**

కదిరి నుండి చిత్తూరుకు షిఫ్ట్ కార్లు లో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ముత్తుకూరు క్రాస్ వద్ద గురువారం కారు డివైడర్ కు ఢీకొనడంతో సాదిక్ 27 సంవత్సరాలు అక్కడికక్కడే మృతి చెందారు మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లి కు తరలించారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

– పార్టీ సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపి పి.వి.మిథున్ రెడ్డి సమీక్ష





**మదనపల్లె (ప్రజా సీమ) :**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పనిచేస్తూ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి. మిథున్ రెడ్డి పిలుపునిచ్చారు.గురువారం రాజంపేట ఎంపీ పి.వి.మిథున్ రెడ్డి స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు స్థానిక నాయకులతో మున్సిపల్,గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.పార్టీ నిర్వహించిన సర్వేల ఆధారంగా వివిధ గ్రామాలు,మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా అభ్యర్థుల ఎంపికతోపాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల ఖరారుపై సమీక్షించారు. స్థానిక పరిస్థితులు,ప్రజల అభిప్రాయాలు, అభ్యర్థుల బలాబలాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను సమన్వయంతో చేపట్టాలని చర్చించారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐక్యతతో పనిచేయాలని,ప్రజా సమస్యలపై ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమిష్టిగా కృషి చేసి వైఎస్సార్ సీపీ బలాన్ని చాటాలని,అధికార పార్టీ విధానాలు, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతూ ఎన్నికల్లో తగిన రాజకీయ సమాధానం ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొని ఎన్నికల సన్నద్ధత,అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,మాజీ శాసనమండలి సభ్యులు బి.నరేష్ కుమార్ రెడ్డి,పార్టీ ఇంచార్జ్ ఎస్.నిసార్ అహ్మద్,ఎస్.ఈ.సి సభ్యురాలు షమీమ్ అస్లాం,మాజీ మునిసిపల్ చైర్మన్ వి.మనుజా రెడ్డి,పరిశీలకులు జింకా చలపతి,మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ కరీముల్లా,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి,రాష్ట్ర ప్రచార కార్యదర్శి సి.పి రాఘవ రెడ్డి, బాబ్జాన్,సీనియర్ నాయకులు సాయి ప్రసాద్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి మహేష్ బాబు,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,కొత్తపల్లి నాగార్జున నాయుడు తదితరులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వనవిహారిణి దేవిగా వాసవి మాత

## - అర్చకుడు ప్రసాద్ శర్మ నేతృత్వంలో విశేష పూజలు

**వేంపల్లె ప్రజాసీమ:**

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదవ రోజు వనవిహారిణి దేవిగా వాసవి మాత దర్శనమిచ్చారు. గురువారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవి మాతకు అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వనవిహారిణి దేవి, మోహిని దేవిగా భక్తులకు కటాక్షించారు. భక్తులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలు. మాజీ జడ్పీటిసి రవికుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. నెల్లూరుకు చెందిన మహాలక్ష్మి ఇవెంట్స్ క్లాసికల్ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, వాసవి కళ్యాణ మండపం, అవోపా, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# ఐసిసిఎస్ డబ్ల్యూఇ ప్రతినిధుల ఢిల్లీ పర్యటన విజయవంతం

## - కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీతో భేటీ

## - ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తల పెండింగ్ పీఎంఈజీపీ సబ్సిడీలపై ఆరా





**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఫర్ ఎస్సీ,ఎస్టీ అండ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ (ఐసిసిఎస్ డబ్ల్యూఇ) న్యూఢిల్లీ జాతీయ అధ్యక్షులు సుబీర్ పౌల్,భారత ప్రభుత్వ సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ) జాయింట్ సెక్రటరీ విపుల్ గోయల్‌ను ఐసిసిఎస్ డబ్ల్యూఇ ప్రతినిధులు బృందం గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద పెండింగ్‌లో ఉన్న సబ్సిడీల విడుదల,అలాగే దేశవ్యాప్తంగా వివిధ బ్యాంకులు మంజూరు చేసిన రుణమొత్తాల విడుదలలో జరుగుతున్న జాప్యంపై చర్చించారు. ఇందులో భాగంగా ఐసిసిఎస్ డబ్ల్యూఇ ప్రతినిధి బృందం, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ),షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ)కు చెందిన పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువచ్చింది. ప్రతినిధి బృందం తెలిపిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సంబంధించిన సుమారు రూ. 1,400 కోట్ల నిధులు వివిధ బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమావేశంలో ప్రస్తావించారు. పీఎంఈజీపీ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీలను సకాలంలో విడుదల చేయడం, బ్యాంకులు మంజూరు చేసిన రుణ మొత్తాలను త్వరగా అందించడం ద్వారా కొత్త పరిశ్రమల స్థాపన,ఇప్పటికే ఉన్న వ్యాపారాల విస్తరణ,ఉపాధి అవకాశాల కల్పన సాధ్యమవుతాయని ప్రతినిధి బృందం పేర్కొంది. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించడంలో,ఆర్థిక బాధ్యతలను నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ,సంబంధిత అమలు సంస్థలు,బ్యాంకుల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని ప్రతినిధి బృందం సూచించింది. అర్హులైన లబ్ధిదారుల పెండింగ్ దరఖాస్తులు,సబ్సిడీ క్లెయిమ్‌లు మరియు మంజూరైన రుణాల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరింది. ఈ సమావేశంలో సీమా కిరణ్ జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్),వోబెని కిథాన్ జాతీయ జాయింట్ సెక్రటరీ (ఈశాన్య ప్రాంతం),మీరా కళ్యాణి రాష్ట్ర అధ్యక్షురాలు (మహిళా విభాగం),నవీన్ రెడ్డి కో-ఆర్డినేటర్ (దక్షిణ భారతదేశం) పాల్గొన్నారు. ఈ ప్రతినిధులు తమతమ రాష్ట్రాల్లో ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా బ్యాంకు రుణాల లభ్యత,పెండింగ్ సబ్సిడీలు, బ్యాంకుల స్థాయిలో జరుగుతున్న జాప్యం,ప్రభుత్వ పారిశ్రామిక పథకాల అమలుకు సంబంధించిన తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సుబీర్ పౌల్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ మరియు మహిళా పారిశ్రామికవేత్తల సమస్యలను సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం,వారికి ఆర్థిక సహాయం సకాలంలో అందేలా కృషి చేయడం మరియు దేశవ్యాప్తంగా సమగ్ర పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం ఐసిసిఎస్ డబ్ల్యూఇ ప్రధాన లక్ష్యాలలో భాగమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు,బ్యాంకులు తగిన చర్యలు తీసుకుంటారని ప్రతినిధి బృందం ఆశాభావం వ్యక్తం చేసింది.

# వైకాపా మదనపల్లి జడ్పిటీసీ అభ్యర్థినిగా బరిలోకి కిరణ్మయి

## - దాదాపుగా ఖరారు చేసిన పార్టీ అధిష్టానం

**మదనపల్లె (ప్రజా సీమ) :**



ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సందడి మొదలైంది. మదనపల్లి జడ్పిటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించారు. ఈ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసు కుంటున్నాయి. ఇందులో భాగంగా వైఎస్సార్సిపి మదనపల్లి జడ్పిటీసీ అభ్యర్థినిగా బిసి కమిషన్ మాజీ సభ్యులు,వైసీపీ యువనాయకులు జేన్నే శేషాచలపతి నాయుడు భార్య కిరణ్మయిని పార్టీ అధిష్టానం దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి,మాజీ ఎమెల్యే డాక్టర్ తిప్పారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ సురేష్ కుమార్ రెడ్డి,మదనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,వైసీపీ ముఖ్య నాయకుల మద్దతుతో జడ్పిటీసీగా కిరణ్మయి పోటీలో దిగుతున్నారు. పాలఏకరి సామాజ వర్గానికి చెందిన శేషాచలపతి నాయుడు వైయస్సార్సీపిలో ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంతో కీలకమైన బీసీ కమిషన్ సభ్యులుగా పనిచేశారు. బీసీల అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. విద్యా వంతురాలైన తన భార్య కిరణ్మయి గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ సభ్యురాలుగా పనిచేశారు.

**కిరణ్మయి రాజకీయ నేపథ్యం**

పాలఏకరి సామాజవర్గానికి చెందిన కిరణ్మయి ఉన్నత విద్యావంతురాలు. గత వైసీపి ప్రభుత్వంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ సభ్యురాలిగా పనిచేశారు. సామాన్యుల కోసం నిరంతరం పనిచేయడం ఆమె నైజం. మదనపల్లి మండలంలో ఎక్కువగా బీసీ సామాజిక వర్గం ఓటర్లు ఉంటున్నారు. అన్ని సామాజిక వర్గాలు వారు శేషాచలపతి నాయుడు భార్య కిరణ్మయికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఒక అవకాశం కల్పిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని,మండల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని జన్నే శేషాచలపతి నాయుడు,కిరణ్మయి దంపతులు పేర్కొన్నారు. ముఖ్య నాయకులు,కార్యకర్తల మద్ధతు ఇవ్వాలని,ఓటర్లు ఆశీర్వదించాలని కోరుతున్నారు.

# పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

## - అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలింపు

**వేంపల్లె ప్రజాసీమ:**

ఓ అమ్మాయిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ వ్యక్తి మోసం చేసిన సంఘటన వేంపల్లెలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వేంపల్లె పట్టణంలోని శ్రీరామ నగర్ ప్రాంతానికి చెందిన అబూబకర్ సిద్దిక్, వేంపల్లెకు చెందిన ఓ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కడప, పులివెందుల పలుచోట్ల లాడ్జీల్లో శారీరకంగా అనుభవించాడు. దీంతో ఆ అమ్మాయి నిలదీయడంతో బెదిరించి దాడికి పాల్పడ్డాడు. ఆ సంఘటనపై పోలిసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్పి మురళీ నాయక్ పర్యవేక్షణలో వేంపల్లె సీఐ నరసింహులు, ఎస్సై తిరుపాల్ నాయక్, సిబ్బంది కలిసి ఆ వ్యక్తిని అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం పులివెందుల ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. అనంతరం సదరు ఆ వ్యక్తిని రిమాండ్ కు తరలించారు.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

## కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్



- భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి
- ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి
- చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్
- పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యమంటున్న భారత్

# విడుదలైన మదనపల్లె మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్

## - అక్టోబర్ 28న పోలింగ్,30న ఓట్ల లెక్కింపు

## - నేటి నుంచి 18వరకు నామినేషన్ల స్వీకరణ

## - మునిసిపల్ కమిషనర్ ప్రమీల వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**



మదనపల్లె పురపాలక సంఘం చైర్‌పర్సన్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వ హణకు సంబంధించి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఎన్నికల కార్యక్రమం ప్రకారం అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించనుండగా, 30వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మేరకు మదనపల్లె మున్సిపల్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి, కమిషనర్ కే.ప్రమీల గురువారం ఎన్నికల ప్రెస్‌నోట్ విడుదల చేశారు. దీంతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి స్పష్టత రావడంతో ఆశావహులు,రాజకీయ పార్టీల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 16వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. అభ్యర్థులు అదే నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేయాలి. 19వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఇచ్చారు. అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు.

**28న పోలింగ్,30న కౌంటింగ్**

అక్టోబర్ 28వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అవసరమైతే 29వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ చేపడతారు. అక్టోబర్ 30వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. చైర్‌పర్సన్,వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు దొంతి లేఅవుట్‌లోని అసిస్టెంట్ అథారిటీ కార్యాలయ నూతన భవనంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంబంధిత వార్డుల ఎన్నికల అధికారులు నామినేషన్లను స్వీకరిస్తారు. నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో నామినేషన్లు సమర్పించాలని ఎన్నికల అధికారులు సూచించారు.

# అగస్తీశ్వర స్వామి అన్నప్రసాద శాల నిర్మాణానికి 50 వేలు విరాళం!

**పుంగనూరు మేజర్ న్యూస్:**

మండల పరిధిలోని నెక్కుంది పంచాయతీలో వెలిసింది శ్రీ అగస్తీశ్వర స్వామి వారి ఆలయం అన్న ప్రసాదశాల నిర్మాణానికివైఎస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కొత్తపల్లి చెంగారెడ్డి కుటుంబ సభ్యులు గురువారం 50వేల రూపాయలు విరాళం అందజేశారు.

# అయ్యప్ప స్వామి దేవాలయం లో శరన్నవరాత్రి ఉత్సవాలు

**కాకినాడ, ప్రజాసీమ, అక్టోబర్ 15**

కాకినాడలో అయ్యప్ప స్వామి దేవాలయం లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. భానుగుడి రిజర్వ్ పోలీస్ లైన్ లో అమ్మవారికి ప్రతీ రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గోపూజ, శివాభిషేకం,కుంకుమపూజలు, బాల పూజ, సువాసిని పూజలు, చండీ హోమం, నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వితరణ తదితర పూజలు జరుగుతున్నాయి. సాయంత్రం ప్రదోష కాలం పూజ, నీరాజన మంత్ర పుష్పాలు, విశేష హారతులు, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం లో దేవాలయం ప్రతినిధి గోపాలకృష్ణ మాస్టారు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# శ్రీ లలితాదేవి

## అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గామాత

**సిద్ధవటం ప్రజా సీమ**

మండలంలోని సాయి నగర్ గ్రామంలో శ్రీ భద్రావతి భావనారాయణ సీతారామ లక్ష్మణ ఆలయంలో దేవి శరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా ఐదవరోజు భక్తులకు దుర్గామాత లలితా దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చింది ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమర్నాథ్ శర్మ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి విశేషమైనటువంటి పూజలు నిర్వహించామన్నారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు



# నిరాశపరిచిన ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ లు.

**ఉప్పాడ, ప్రజాసీమ,అక్టోబర్ 15:**

కొత్తపల్లి మండలం ఎంపీ స్థానాలకు ఖరారు రిజర్వేషన్లు ఆశావహులు నిరాశపరి చాయి. కొత్తపల్లి మండలంలో 24 ఎంపిటిసి స్థానాలకు ఎస్సీ 4 బీసీ 8 అన్ రిజర్వుడ్ 12 కేటాయించారు. ఆయా స్థానాల్లో ఆశావహులు పోటీ చేయడానికి వీలు లేకపోవడంతో ఆయా స్థానాల్లో వారి తాలూకా వ్యక్తులను పోటీలో నిలిపేందుకు ప్రధాన పార్టీ నాయకుల ఆశీస్సుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మండలానికి చెందిన జనసేన కార్యకర్తలు అధినాయకుల పిలుపు కోసం వెంపర్లాడుతున్నారు. టిడిపి చెందిన నాయకులు కార్యకర్తలు ఇప్పటివరకు స్తబ్దత గా ఉండగా, వైసీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులు ఏది ఏమైనా పోటీ చేయాల్సిందే అని నిర్ణయానికి వచ్చారు.

# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

## పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

**పెద్దాపురం, ప్రజాసీమ, అక్టోబర్ 15**

స్థానిక సంస్థలు ఎన్నికల్లో భాగంగా పెద్దాపురం మున్సిపల్ ఎన్నికలకు 32 వార్డులకు ఈనెల 16వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, దానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పెద్దాపురం మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ప్రక్కన గల ఆడిటోరియంలో అన్ని వార్డులు మరియు చైర్మన్ కి సంబంధించి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రతీ 4వార్డులకు ఒక ఎన్నికల అధికారిని, చైర్మన్ నామినేషన్ లకు సంబంధించి ఒక ఎన్నికల అధికారిని మొత్తంగా 9మంది ఎన్నికల అధికారులను ఎన్నికల కమీషన్ నియమించగా వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. నామినేషన్ పక్రియ సందర్భంగా మున్సిపల్ ఆడిటోరియం భయట 4హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశామన్నారు.16 నుంచి 18 వరకు నామినేషన్ పక్రియ,19వ తేదీన నామినేషన్ ల పరిశీలన, 20,21 తేదీల్లో నామినేషన్లు ఉప సంహరణ ఉంటుందన్నారు. అనంతరం అభ్యర్థులను ఫైనల్ చేసి 28 తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలింగుకు సంభందించి ప్రతీ వార్డుకు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 32 రెండు వార్డులకు 64 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలను వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇంకా బ్యాలెట్ బాక్స్ ల భద్రతకు, 30వ తేదీ ఓట్ల లెక్కింపునకు స్థానిక రామారావు పేటలోని బ్రాహ్మణ కమ్యూనిటీ హాలును ప్రతిపాదించినట్టు కమిషనర్ చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆమోదంతో దానిని ఖరారు చేయాల్సి ఉందన్నారు. కాగా పెద్దాపురం మున్సిపాల్టీలో ఎన్నికల నియమావాళి అమల్లో ఉన్నందున ప్రజలు, అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ బ్యానర్లు ఏర్పాటు, సమావేశాలు వంటి కార్యక్రమాలు చేపట్టారాదని ఈ సందర్బంగా కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కాగా నామినేషన్ ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లను, బ్యాలెట్ బాక్స్ లు భద్రపరచే స్ట్రాంగ్ రూము ను సిఐ వై ఆర్ కె శ్రీనివాస్ తో కలసి కమిషనర్ పరిశీలించారు.



# జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలు

## వైసీపీ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వాదనలు ముగిశాయి. ప్రతి జిల్లా కేంద్రంలో ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. బుధవారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వీరా రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సాధారణ నామినేషన్ కేంద్రాలు సరిపోవని, అభ్యర్థుల భద్రత దృష్ట్యా ప్రతి జిల్లా కేంద్రంలో అదనపు కేంద్రాలు అవసరమని కోర్టుకు విన్నవించారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించినా ఎలాంటి స్పందన రాలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాల శ్రీనివాస్, ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది అశ్విని కుమార్ వాదనలు వినిపించారు. నామినేషన్ల దాఖలుకు మూడు రోజుల సమయం ఉంటుందని, ఎవరైనా అడ్డుకుంటే ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందని తెలిపారు. కేవలం అనుమానాల ప్రాతిపదికన న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రాల్లో నామినేషన్ కేంద్రాల ఏర్పాటు అనేది ఎన్నికల అధికారి విచక్షణకు లోబడి ఉంటుందని, ప్రస్తుత నిబంధనల్లో దానికి అవకాశం లేదని వివరించారు. ఇప్పటికే నామినేషన్, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కోర్టుకు నివేదించారు.

# అన్నపూర్ణా దేవి అలంకారములో బోయకొండ గంగమ్మ!

**చౌడేపల్లి ప్రజాసీమ :**

ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానము నందు అత్యంత వైభవముగా జరుగుచున్న దసరా మహోత్సవాలలో నాలుగవ రోజు గురువారం అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చినారు. ఆలయఅర్చకులుఉభయదారులతో గణపతి హోమము, చండీ హోమము నిర్వహించినారు. ఈ కార్యక్రమములో దేవస్థాన ఉప కమీషనరు, కార్యనిర్వహణాధికారి ఏకాంబరం, దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేసి అమ్మవారి దర్శన భాగ్యము కల్పించినారు.



# వేడుకను తలపించిన మిట్స్ యూనివర్సిటీ ఫ్రెషర్స్ డే-2026

– హాజరైన ఆమ్‌డాక్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇ.శ్రీనివాస చక్రవర్తి– ప్రత్యేకంగా ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు





**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు ఫ్రెషర్స్ డే-2026 వేడుకలను గురువారం అట్టహాసంగా జరుపుకున్నారు.మిట్స్ యూనివర్సిటీలో చేరిన నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ 2026 ఫ్రెషర్స్ డేని ఎంతో ఉత్సాహంగా విద్యార్థులు జరుపు కున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఈ.శ్రీనివాస చక్రవర్తి,వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ -- రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్,ఆమ్‌డాక్స్,స్ట్రాటజిక్ అడ్వైజర్ – ఆదిచుంచనగిరి గ్రూప్,మాజీ వైస్ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ హెడ్ – రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్,గ్లోబల్ మొబిలిటీ అండ్ షేర్డ్ సర్వీసెస్,టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) పాల్గొన్నారు.ముందుగా ముఖ్య అతిథితోపాటు మిట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యకమాన్ని ప్రారంభించారు.ముందుగ డాక్టర్ ఈ.శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే నాలుగేళ్లలో ప్రతి విద్యార్థి మూడు ప్రధాన లక్ష్యాలను సాధించాలన్నారు. మొదటిగా,2030 నాటికి ప్రతి విద్యార్థి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి,తమ విభాగానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిష్కారాలను రూపొందించే సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలని తెలిపారు.రెండవది,సమస్యలను గుర్తించి,వాటికి సమర్థవంతమైన పరిష్కారాలను కనుగొనే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని, ఇది ఉన్నత విద్య, ఉద్యోగాలు, పరిశోధనలు,ఆవిష్కరణలు,పారిశ్రామిక రంగాల్లో రాణించేందుకు ఎంతో ఉపయోగ పడు తుందన్నారు. మూడవది తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం, ఇతరులకు అర్థమయ్యేలా వివరించడం, ప్రజెంటేషన్ల ద్వారా ప్రభావవంతంగా తెలియజేయడం వంటి కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏఐ పరిజ్ఞానం,సమస్య పరిష్కర సామర్థ్యం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ అనే ఈ మూడు లక్ష్యాలను సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంతోపాటు, సాంకేతిక రంగంలో విజయవంతమైన ఇంజనీర్లుగా ఎదగ గలరని ఆయన అన్నారు.ప్రస్తుత ఏఐ,ఏజెంటిక్ టెక్నాలజీ ఆధారిత ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు ఐదు కీలక సాంకేతిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గణితం,డేటా సైన్స్,ప్రాంప్ట్ ఇంజనీరింగ్ మరియు కాంటెక్స్ట్ ఇంజనీరింగ్,క్లౌడ్ కంప్యూటింగ్ మరియు మెషిన్ లెర్నింగ్ ఆపరేషన్స్ (ఎంఎలాప్స్),పైథాన్ ప్రోగ్రామింగ్‌లను భవిష్యత్తు సాంకేతిక రంగాల్లో విజయానికి అవసరమైన ముఖ్యమైన నైపుణ్యాలుగా వివరించారు.ఏఐ అభివృద్ధికి గణితం పునాది కాగా,డేటా దాని పనితీరుకు అత్యంత కీలకమని తెలిపారు. ఏఐ వ్యవస్థలకు సరైన సూచనలు ఇవ్వడం,అవసరమైన సమాచారాన్ని సందర్భానుసారంగా అందించడం,క్లౌడ్ సాంకేతికతను వినియోగించడం,మెషిన్ లెర్నింగ్ మోడళ్లను నిర్వహించడం,పైథాన్ ప్రోగ్రామింగ్‌ను అభ్యసించడం వంటి అంశాలపై విద్యార్థులు నిరంతరం సాధన చేయాలని సూచించారు.ఈ నైపుణ్యాలను పాఠ్యాం శాలకు మాత్రమే పరిమితం చేయకుండా స్వయంగా నేర్చుకుంటూ,ప్రాజెక్టుల ద్వారా ఆచరణలో పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమం ముగింపులో విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఉపయోగపడే ఏఐ ఆధారిత ఏజెంటిక్ ఫ్రేమ్‌వర్క్‌ల రూపకల్పనలో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్య అతిథి డాక్టర్ ఈ.శ్రీనివాస చక్రవర్తి తెలిపారు.విద్యార్థులు తమ లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేస్తూ,సాంకేతిక పరిజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలు,సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకొని సమాజానికి,దేశాభివృద్ధికి ఉపయోగపడే ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని తెలిపారు.అనంతరం నూతన విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, వినోదభరిత ప్రదర్శనలతో సందడి చేసి అలరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డీన్–ఫస్ట్ ఇయర్ బీటెక్ డాక్టర్ చంద్ర మోహన్,డీన్–స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా,డీన్ స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ డాక్టర్ భాను శ్రీ రెడ్డి,డైరెక్టర్–అడ్మిషన్స్ డాక్టర్ దీపాంకర్ రాయ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కమల్ బాషా,సాక్ కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి హేమంత,శాయిాజ్ అహమ్మద్,నవీన్ కుమార్, యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది,మొదటి సంవత్సరం విద్యార్థులు,ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.







# ఆరు మున్సిపాలిటీల్లో 191 వార్డులకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.

## - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంథిర ప్రసాద్,




**కాకినాడ, ప్రజాసీమ ప్రతినిది,అక్టోబరు 15:**

జిల్లాలోని ఆరు మున్సి పాలిటీల పరిధిలో 191 వార్డులకు సంబంధించి 321 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంథిర ప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు వివరాలను వెల్లడించారు.ఆరు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 2,18, 054 మంది ఓటర్లు తమ ఓటు హక్కును విని యోగించుకోనున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 28వ తేదీన పోలింగ్, 30వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వెల్ల డించారు.ఎన్నికల ప్రక్రియలో రెండు రకాల బ్యాలెట్ పేపర్లను వినియోగించనున్నామని, వార్డు సభ్యుల ఎన్నికకు పింక్ రంగు బ్యాలెట్ పేపర్‌ను, చైర్మన్ ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగించనున్నట్లు వివరించారు. ఇప్పటికే అభ్యర్థులకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, నిర్దేశించిన ఖర్చుల పరిమితిని మించి వ్యయం చేయరాదని సూచించారు.ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలను సకాలంలో సమర్పించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన 45 రోజుల్లోగా అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించాల్సి ఉంటుందని, లేనిపక్షంలో భవిష్యత్తులో నిర్వహించే ఎన్నికల్లో అనర్హతకు గురయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.ఓటర్లను ప్రలోభపెట్టే ఉద్దేశంతో నగదు, బహుమతులు పంపిణీ చేయరాదని, కులాలు, మతాల పేరుతో ఓట్లు అభ్యర్థించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛా యుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.స్ట్రాంగ్ రూములకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా స్ట్రాంగ్ రూముల వద్ద రెండు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ప్రజలు, అభ్యర్థులు తమ ఫిర్యాదులను తెలియ జేసేందుకు జిల్లా స్థాయిలో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌తో పాటు ప్రతి మండల కేంద్రంలోనూ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నంబర్ 8978875559 అని ప్రకటించారు. ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ)కు సంబంధించిన ఫిర్యాదులతో పాటు ఇతర ఎన్నికల ఫిర్యాదులను కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చని, వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.. అభ్యర్థులు ఊరేగింపులు అనుమతుల కోరకు సింగల్ విండో సిస్టం ద్వారా వినియోగించు కోవాలని. వివిధ పత్రిక ప్రకటనలకు గాను ఎంసిఎంసి సర్టిఫికెట్ పొందాలన్నారు.జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 12,61,063 మంది ఓటర్లు 1,426 పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.జిల్లాలో మొత్తం 430 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వివిధ కారణాలు, కోర్టు కేసుల నేపథ్యంలో 29 స్థానాలకు ఎన్నికలు నిలిపివేసినట్లు, మిగిలిన 401 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు.జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను కాకినాడ జేఎన్టీయూ, పెద్దాపురం ఎం.ఆర్. కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 1,426 పోలింగ్ కేంద్రాల్లో 436 సమస్యాత్మక, 270 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 151 సమస్యాత్మక, 27 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ.. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిం చేందుకు సీసీటీవీ ఫుటేజీ, వీడియో కవరేజీ ఏర్పాట్లు చేపడుతున్నామని వెల్లడించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటు న్నామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి వి. వి.వి.ఎస్. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ

# గిల్‌తో భేటీ, సూర్యవంశీపై ప్రశంసలు..

## భారత సంతతి ఎఫ్1 డ్రైవర్ అర్విద్ లిండ్‌బ్లాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో సంభాషించానన్న ఎఫ్1 డ్రైవర్ అర్విద్ లిండ్‌బ్లాడ్**

**వివిధ క్రీడల మధ్య తేడాలపై గిల్‌తో క్లుప్తంగా చర్చించినట్లు వెల్లడి**

**యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతిభను కొనియాడిన అర్విద్**

**యువత రాణించడానికి మెరుగైన టెక్నాలజీ, కోచింగే కారణమని అభిప్రాయం**

**ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్న రేసింగ్ స్టార్**

ప్రపంచ ప్రఖ్యాత ఫార్ములా 1 రేసింగ్ ట్రాక్‌పై తన వేగంతో దూసుకుపోతున్న భారత సంతతి డ్రైవర్ అర్విద్ లిండ్‌బ్లాడ్, భారత క్రికెట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా టెస్ట్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో తన సమావేశం గురించి, యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతిభ గురించి ప్రశంసలు కురిపించాడు. క్రీడలు వేరైనా, క్రీడాకారుల మధ్య ఉండే స్ఫూర్తి ఒకటేనని చాటిచెప్పాడు.రేసింగ్ బుల్స్ జట్టు తరపున ఫార్ములా 1లో పోటీ పడుతున్న 19 ఏళ్ల అర్విద్ లిండ్‌బ్లాడ్, ఎన్డీటీవీకి ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలు పంచుకున్నాడు. ప్రస్తుత 2026 ఫార్ములా 1 సీజన్‌లో భాగంగా సిల్వర్‌స్టోన్‌లో శుభ్‌మన్ గిల్‌ను కలిశానని, అంతకుముందు ఈ ఏడాది ఆరంభంలో భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు హాజరైనప్పుడు కూడా గిల్‌తో మాట్లాడానని తెలిపాడు. గిల్‌ను "చాలా మంచి వ్యక్తి"గా అభివర్ణించిన అర్విద్, తమ మధ్య తమ క్రీడల్లోని వ్యత్యాసాల గురించి క్లుప్తంగా చర్చ జరిగిందని అన్నాడు. "మా క్రీడల మధ్య ఉన్న తేడాల గురించి, అతను కొన్ని విషయాలను ఎలా నిర్వహిస్తాడో క్లుప్తంగా మాట్లాడుకున్నాం. వివిధ క్రీడలకు చెందిన అథ్లెట్లు ఒకరి నుంచి ఒకరు నేర్చుకోవడం క్రీడారంగంలో ఒక అద్భుతమైన విషయం. అయితే, మా మధ్య సంభాషణ చాలా లోతుగా ఏమీ జరగలేదు. అది చాలా తక్కువ సమయం జరిగింది" అని అర్విద్ వివరించాడు.ఇదే సమయంలో, భారత క్రికెట్ యువ సంచలనం యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీపై అర్విద్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఇంత చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అసాధారణమని కొనియాడాడు. "అతని ప్రతిభ నన్ను చాలా ఆకట్టుకుంది. ఇంత చిన్న వయసులో ఒకరు ఇంత పెద్ద వేదికపై రాణించడం చూడటం చాలా అద్భుతంగా ఉంది" అని అన్నాడు.నేటి తరం యువ క్రీడాకారులు చిన్న వయసులోనే ఎందుకు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారన్న ప్రశ్నకు అర్విద్ ఆసక్తికరంగా సమాధానమిచ్చారు. "బహుశా అది వాళ్లు తినే రాజ్మా (ఓ రకమైన పప్పు ధాన్యం) వల్ల కావచ్చు!" అని సరదాగా చమత్కరించిన ఈ టీనేజ్ రేసర్, అసలు కారణాలను విశ్లేషించాడు. "సాంకేతికతలో వచ్చిన మార్పులు, మెరుగైన కోచింగ్, ఉన్నతస్థాయి శిక్షణ పద్ధతులు యువ క్రీడాకారులు వేగంగా నేర్చుకోవడానికి సహాయపడుతున్నాయి. వైభవ్ సాధించిన విజయం చాలా విశేషమైనది. అంత చిన్న వయసులోనే పేరు సంపాదించడం అత్యంత ప్రశంసనీయం. అతనికి నా శుభాకాంక్షలు" అని అర్విద్ లిండ్‌బ్లాడ్ పేర్కొన్నాడు.

# బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు..

## కానీ మా దగ్గర ప్రతిభ ఉంది: సంజూ శాంసన్

**బుమ్రా లాంటి బౌలర్‌కు ప్రత్యామ్నాయం లేదని చెప్పిన సంజూ శాంసన్**

**యువ బౌలర్లు అర్ష్‌దీప్, ప్రిన్స్ యాదవ్‌లను ప్రశంసించిన వికెట్ కీపర్**

**అద్భుతంగా ఆడుతున్న షాయ్ హోప్‌ను గౌరవించాల్సిందేనని వ్యాఖ్య**

**తిలక్ వర్మ ఔట్ కావడమే మ్యాచ్‌లో కీలక మలుపు అని వెల్లడి**

**ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు మద్దతుగా నిలిచిన శాంసన్**



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి అనంతరం వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, ఆయన లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని అంగీకరించాడు.ఆసియా క్రీడల తర్వాత వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శాంసన్ మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రా ఒక తరం గర్వించదగ్గ బౌలర్. అలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మన అదృష్టం. ఆయనకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ, మన జట్టులోకి మంచి ప్రతిభ ఉన్న యువ ఆటగాళ్లు వస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. అలాగే గత కొన్ని మ్యాచ్‌లలో ప్రిన్స్ యాదవ్ కూడా ఆకట్టుకుంటున్నాడు. వారికి మనం ఎంత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, వారు అంతగా రాటుదేలుతారు" అని వివరించాడు. బ్యాటింగ్ చేస్తూ గాయపడిన అర్ష్‌దీప్ గురించి మాట్లాడుతూ.. "అతను భుజానికి ఐస్ పెట్టుకుంటున్నాడు. త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నాను" అని తెలిపాడు.వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఫామ్‌ను శాంసన్ ప్రశంసించాడు. "హోప్ చాలా బాగా ఆడుతున్నాడు. అతని ఆటను మనం గౌరవించాలి. పెద్దగా రిస్క్ తీసుకోకుండా, మంచి క్రికెటింగ్ షాట్లతో బౌలర్లను గౌరవిస్తూ పరుగులు చేస్తున్నాడు. అతడి బ్యాటింగ్‌కు కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాలి. ప్రతి మ్యాచ్‌లో అతడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మేం దృష్టి సారిస్తున్నాం" అని పేర్కొన్నాడు.ఈ మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ.. 17వ ఓవర్‌లో తిలక్ వర్మ ఔట్ కావడమే కీలక మలుపు అని శాంసన్ అభిప్రాయపడ్డాడు. "తిలక్ ఔట్ అయ్యే వరకు మేం లక్ష్య ఛేదనలో సరైన మార్గంలోనే ఉన్నాం. ఓవర్‌కు 10-12 పరుగులు సులభంగా రాబడుతున్నాం. ఒత్తిడిలోనూ నితీశ్ రెడ్డి, తిలక్ వర్మ అద్భుతంగా ఆడారు" అని కొనియాడాడు. ఇదే సమయంలో ఫామ్ కోల్పోయిన ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు అండగా నిలిచాడు. "ఇషాన్, అభిషేక్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఓపెనర్లు. ఒక మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన ఆందోళన అవసరం లేదు. గత మ్యాచ్‌లోనే అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడాడు. ఇషాన్ నిలకడగా రాణిస్తున్నాడు" అని వారికి మద్దతుగా నిలిచాడు.



# ఇలా అయితే వరల్డ్ కప్ ఎప్పటికీ గెలవలేరు..

## టీమిండియాపై మాజీ స్టార్ క్రికెటర్ విసుర్లు

**నాలుగో టీ20లో భారత్‌పై వెస్టిండీస్ 24 పరుగుల విజయం**

**భారత బౌలింగ్‌పై మహమ్మద్ కైఫ్ తీవ్ర విమర్శలు**

**బౌలింగ్ మెరుగుపడకపోతే ప్రపంచకప్ కష్టమని హెచ్చరిక**

**తొలి టీ20 మినహా ప్రతి మ్యాచ్‌లోనూ 200కుపైగా పరుగులు సమర్పణ**

**2024 టీ20 ప్రపంచకప్‌లో సమష్టి ప్రదర్శనను గుర్తుచేసిన కైఫ్**

వెస్టిండీస్‌తో నాలుగో టీ20లో ఓటమి తర్వాత భారత జట్టు బౌలింగ్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర విమర్శలు చేశాడు. బౌలర్లు ఇదే తీరులో విఫలమైతే ప్రపంచకప్ గెలవడం అసాధ్యమని హెచ్చరించాడు. కేవలం ఒక్క మ్యాచ్‌లో ఓటమిని చూసి ఈ వ్యాఖ్యలు చేయడం లేదని, సిరీస్ మొత్తం బౌలింగ్‌లో కనిపిస్తున్న లోపాలే తన ఆందోళనకు కారణమని స్పష్టం చేశాడు.బుధవారం జరిగిన నాలుగో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత్ పోరాడినా 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌పై క్రిక్‌బజ్‌తో మాట్లాడిన కైఫ్.. భారత బౌలర్ల వైఫల్యమే ఓటమికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డాడు. 247 పరుగులు భారీ స్కోరని, ప్రత్యర్థిని అంతటి స్కోరుకు అనుమతించినప్పుడు ఓటమికి బౌలర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నాడు.

# సెలెక్టర్ పదవికి ఇద్దరు దిగ్గజాల నో..

## బీసీసీఐ ఆఫర్‌ను తిరస్కరించిన మాజీలు

**సెలెక్టర్ పదవి చేపట్టేందుకు ఇద్దరు సీనియర్ క్రికెటర్ల నిరాకరణ**

**అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీ**

**జీతభత్యాలు పెంచినప్పటికీ పదవి చేపట్టేందుకు ప్రముఖుల విముఖత**

**రేసులో ఉన్నాడనుకున్న పార్థివ్ పటేల్ సైతం దరఖాస్తు చేసుకోని వైనం**

**వెస్ట్ జోన్ కోటాలో కొత్త సెలెక్టర్ కోసం కొనసాగుతున్న బీసీసీఐ అన్వేషణ**

బీసీసీఐకి కొత్త తలనొప్పి మొదలైంది. పురుషుల జాతీయ జట్టు సెలెక్షన్ కమిటీలో ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసేందుకు ప్రముఖ ఆటగాళ్లను తీసుకురావాలన్న ప్రయత్నాలకు చుక్కెదురవుతోంది. దాదాపు 100 టెస్టులు ఆడిన ఇద్దరు మాజీ దిగ్గజ క్రికెటర్లను సెలెక్టర్ పదవి చేపట్టాలని బీసీసీఐ సంప్రదించగా, వారు ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించిన అజిత్ అగార్కర్, తన పదవీకాలాన్ని పొడిగించుకునేందుకు ఇష్టపడకపోవడంతో ఈ నెల ప్రారంభంలో అతడి పదవీకాలం ముగిసింది. దీంతో సెలెక్షన్ కమిటీలో ఒక స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో వెస్ట్ జోన్ కోటాలో సెలెక్టర్ పదవికి బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. అక్టోబర్ 14తో ఈ గడువు కూడా ముగిసింది. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రజ్ఞాన్ ఓఝా (తాత్కాలిక ఛైర్మన్), ఆర్‌పీ సింగ్, అజయ్ రాత్రా, ఎస్ఎస్ దాస్ సభ్యులుగా కొనసాగుతున్నారు.సెలెక్టర్ల వంటి కీలక పదవుల్లోకి పేరున్న, అనుభవజ్ఞులైన ఆటగాళ్లను తీసుకురావాలని బీసీసీఐ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం వారి జీతభత్యాల ప్యాకేజీని కూడా గణనీయంగా పెంచేందుకు సుముఖత చూపింది. 2026-27 సంవత్సరానికి సెలెక్షన్ కమిటీల వార్షిక బడ్జెట్‌ను కూడా పెంచారు. అయినప్పటికీ, ఈ పదవిని చేపట్టేందుకు సీనియర్ ఆటగాళ్లు ముందుకు రాకపోవడం గమనార్హం. ఈ పదవికి పోటీలో ఉంటారని భావించిన మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ సైతం దరఖాస్తు చేసుకోలేదు.సెలెక్టర్ పదవికి దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం ఏడు టెస్టులు లేదా 30 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. అలాగే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరై ఐదేళ్లు పూర్తయి ఉండాలి. జీతభత్యాలు పెంచి, భారీ ఆఫర్లు ఇస్తున్నా సీనియర్ ఆటగాళ్లు విముఖత చూపడంతో ఐదుగురు సభ్యుల కమిటీని పూర్తి చేయడానికి బీసీసీఐ తన అన్వేషణను కొనసాగిస్తోంది.



# రంజీ ట్రోఫీలో సత్తా చాటిన మహారాష్ట్ర స్పిన్నర్ విక్కీ ఓస్త్వాల్

**సర్వీసెస్‌పై ఐదు వికెట్లు, హాఫ్ సెంచరీతో ఆల్‌రౌండ్ ప్రదర్శన-విరాట్ కోహ్లీ వర్క్ ఎథిక్ తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని వెల్లడి**

**ఆర్‌సీబీలో కోహ్లీ ఇచ్చిన సలహాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచాయన్న యువ క్రికెటర్-మహారాష్ట్రకు రంజీ ట్రోఫీ అందించడమే తన మొదటి లక్ష్యమని స్పష్టం**

రంజీ ట్రోఫీ సీజన్ తొలి మ్యాచ్‌లోనే మహారాష్ట్ర యువ స్పిన్నర్ విక్కీ ఓస్త్వాల్ అద్భుత ప్రదర్శనతో జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. బంతితో ఐదు వికెట్లు, బ్యాట్‌తో కీలకమైన హాఫ్ సెంచరీ సాధించి ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్నాడు. తన ఆత్మవిశ్వాసం పెరగడానికి విరాట్ కోహ్లీ నుంచి నేర్చుకున్న పాఠాలే కారణమని, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అనుభవం ఎంతో ఉపయోగపడిందని మ్యాచ్ అనంతరం ఓస్త్వాల్ తెలిపాడు.ఢిల్లీలోని పాలమ్‌లో సర్వీసెస్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఓస్త్వాల్ కీలక పాత్ర పోషించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 26.1 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 50 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో సర్వీసెస్ జట్టు 120 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు, మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులు చేయగా, ఓస్త్వాల్ 50 పరుగులతో రాణించాడు. ఈ ప్రదర్శనతో మహారాష్ట్రకు 110 పరుగుల ఆధిక్యం లభించి, నాలుగో రోజే విజయం సాధించింది.ఈ సందర్భంగా విక్కీ ఓస్త్వాల్ మాట్లాడుతూ "జట్టు విజయంలో బ్యాట్, బంతితో రాణించడం సంతోషంగా ఉంది. నా ప్రదర్శన వెనుక విరాట్ కోహ్లీ స్ఫూర్తి ఉంది. ఆర్‌సీబీ నెట్స్‌లో అతడికి బౌలింగ్ చేసినప్పుడు ఎంతో నేర్చుకున్నాను. నెట్స్‌లో కూడా కోహ్లీ 100 శాతం కష్టపడతాడు. 'నీ వర్క్ ఎథిక్స్ సరిగ్గా ఉంటే, ప్రతీ రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తే చాలు, ప్రతిభ దానంతట అదే వస్తుంది' అని కోహ్లీ చెప్పిన మాటలు నాలో ఎంతో స్ఫూర్తి నింపాయి" అని వివరించాడు.ఐపీఎల్‌లో 2026 సీజన్‌కు ఆర్‌సీబీలో చేరిన ఓస్త్వాల్, గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు ఐపీఎల్ అరంగేట్రం చేయనప్పటికీ, దేశవాళీ క్రికెట్‌కే తన తొలి ప్రాధాన్యం అని స్పష్టం చేశాడు. మహారాష్ట్రకు రంజీ ట్రోఫీని అందించడమే తన మొదటి లక్ష్యమని, ఆ తర్వాత ఐపీఎల్, భారత జట్టుకు ఆడటమే తన కల అని పేర్కొన్నాడు. రంజీ ట్రోఫీలో ఇది అతనికి మూడో ఐదు వికెట్ల ప్రదర్శన.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma